


# రెండు ప్రాణులు

శ్రీ రామారాయ్ వర్మ

కుంచెం బెవ్వెట్టవే-కడుపు నిండలేదు, అన్నాడు వెంకప్ప చెయ్యి నాకుతూ. ఎదురుగా కూర్చున్న పిల్లి మ్యా, మ్యా అంది. లేదు అయ్యా! అంది జాలిగా. కుక్కపిల్ల ఆడమనిషివైపు చూసి తోకాడిస్తూ ఊఁ ఊఁ అంది. నీకూను కూడు లేదు. వెంకప్ప గిన్నెను దూరంగా త్రోసి చెంబులో నీళ్లు త్రాగేడు. పిల్లిపిల్ల కాలుతో గిన్నెను ఇటూ అటూ దొర్లించింది. గుర్రుమన్నా లెక్క చేయలేదు. వెంకప్ప మొహం చూసి మ్యాం అంది. కుక్కపిల్ల సంగతి కనిపెట్టి చెంబులో నీళ్లు త్రాగింది. పిల్లి ఎక్కడికో చెంగ్ మని చీకట్లో కలిసిపోయింది.

ఊరుకు చివర్ని ఉన్న కొంప అదే. చుట్టూ చెట్లూ రుప్పలు తప్ప మంచి చెట్టుగాని, దృశ్యంగాని లేదు. తల్లీ కొడుకు కష్టపడటం చూసేదుగాని రాత్రుళ్లు తిండి చాలక ఎంత దుఃఖస్తున్నారో తెలీదు సూర్యుడికి. వాళ్ల సుఖం ఎల్లాంటిదో నక్షత్రాలకు తెలుసు. ఒకోసారి చంద్రుడు తారఅలిగి గురునిదగ్గరకు వెళ్లినప్పుడు మాత్రం వీళ్లనో కంట కనిపెట్టి చల్లని కిరణాలతో వాళ్లకు హాయి అనిపిస్తాడు. ఆరోజున చంద్రుడు కూడా వీళ్లను వెంటనే చూడకుండా ఊళ్లో ధనికుల సౌధాల్లో తొంగి చూస్తున్నాడు.

వెంకప్పకు పదోపడి. తల్లి సుబ్బాలు-నలభయి సంవత్సరాలు వయస్సు—అయినాచూడ్డానికి ఇంకాఎక్కువ వయస్సు ఉంది అనిపిస్తుంది శుష్కించి పోయిన దేహం వల్ల. సుబ్బాలుభర్త రాళ్లుకొట్టేచోట పనిచేసేవాడు కూలికి. వాడి అదృష్టంకొద్దీ ప్రేలింది అనుకుని రాళ్లదగ్గరకు వెళ్లేసరికి మందు దట్టించిన రాయి ధన్ మని వాడి రూపుకూడా లేకుండా చేసింది. అధికారి సుబ్బాలు మొత్తుకుంటే ఓపాతిక రూపాయలు ఇచ్చేడు. ఇది జరిగి

మూడు సంవత్సరాలయింది. సుబ్బాలు భర్త చనిపోయేక జబ్బుపడ్డాది. ఓపదిరూపాయలు అప్పుకూడా అయింది రోగం మానేసరికి. కూలిపనులు చేసుకోలేక మూడు కొంపల్లో దాసీపని చేస్తుంది. ఆమూడు ఇండ్లు ఉద్యోగస్తులవి. తోమే అంట్లల్లో కాస్తకెరడేనా ఉండదు. నెల అయ్యేసరికి మూడు రూపాయలు వస్తయి మొత్తం. వెంకప్ప రైలుస్టేషను దగ్గర చిన్న చిన్న మూటలుమోసి రోజుకు అణా, బేడా, ఒకొకప్పుడు కానీ సంపాదిస్తాడు. స్టేషను దగ్గర వాడిలాటివాళ్లు పాతిక మందికి పైగా ఉన్నారు. మూటెత్తుకుని రోడ్డుకు అడ్డంగా నడుస్తున్నాడని కోపంతో ఇనస్పెక్టరుగారు సైకిలు పెట్టేరు వాడిమీద. కాలుకు దెబ్బతగిలి నెల్లాళ్లు ఇల్లు కదలలేదు. ఇప్పుడేనా చిన్న చిన్నవి పెద్దపెద్దవాళ్ల సామాన్లుమోస్తూ రోజల్లా తిరిగి అర్ధణా సంపాదించి తల్లికిస్తాడు. కుర్రాడికి పని చూపమని పనిచేసే చోట తల్లిఎంతో బ్రతిమిలాడింది. లాభంలేక పోయింది.

ఆరోజున ఓయజమానిగారింట్లో వెండి గిన్నె పోయిందన్నారు. మిగత బంట్రోతులు సుబ్బాలు మీద పెట్టేసరికి పనిచెయ్యవద్దు-జీతం ఇచ్చేదిలేదు పొమ్మన్నారు. ఇంట్లో ఆపూటకే బియ్యపు గింజలులేవు. గిద్దెడు గింజలుంటే అవే వండిపెట్టింది కొడుక్కు. తనో ముద్ద నోట్లో వేసుకుంది. జరిగిన సంగతి కొడుక్కు చెప్పలేదింకా. వీళ్ల కొంపదగ్గరకు ఒచ్చేసేడు చంద్రుడు. ధనికులసౌధాల్లో జరిగే వన్నె చూడలేక కాబోలు.

“అమ్మా, ఎన్నెలొచ్చిందే, ఇక్కడే పండుకుంటా” నంటూ ఓచింకి చాప వాకిట్లో పర్చుకుని పరున్నాడు ఆకాశంవైపు చూసి——“అమ్మా!” అని పిల్చేడు. వస్తా, నంటూ తలుపుకట్టేసి ఓచింకిగోను చాపప్రక్కను వేసుకు పడుకుని జరి గిన సంగతి చెప్పింది కొడుక్కు. తల్లికళ్ల వెంబడి నీళ్లు కారటం చూసేడు. “ఏడవకే అమ్మా, పోనీలే నీళ్లు త్రాగి ఉందాం. పడుకో” అన్నాడు. తల్లి నిద్రపోయింది. వెంకప్పకు నిద్ర రాలేదు. ఆకాశంవైపు చూస్తున్నాడు. ఒంటిగంట ప్యాసింజరు హోరుపెట్టూ ఒస్తుంది. ఇంజను హెడ్ లైట్ కాంతి ఆచెట్ల సందులోంచి భయంకరంగా కనబడుతున్నాయి. వెంకప్ప లేచి రైలు బండి దీపాల్ని చూస్తున్నాడు. ఒక్క నిమిషంలో మాయమైందా బండి.

* * *

మూడు మాసాలనుంచి సుబ్బాలు-వెంకప్ప శుభ్రమైన తిండిని గుడ్డను చూస్తున్నారు. సుబ్బాలు దాసీ పని మానలేదు.

ఆరోజున ఆకాశం మీద నక్షత్రాలుకు సంత. ఒక్క చిన్న మేఘం ముక్కేనాలేదు. చెట్లమీద గుడ్లగూబలు ఇక్కడికి అక్కడికి షికార్లు. నక్కలు నక్షత్రాలను చూసి దడిపిస్తున్నాయి. రాత్రి ఒంటి గంటల ప్యాసింజరు నక్కల సంగీతానికి తాళంవేస్తూ వచ్చేస్తుంది. నల్లినిదుస్తులు ముసుగు రుప్పలదగ్గర నుల్చుండో వ్యక్తి. రైలు అక్కడికి వచ్చేసరికి టప్ మని పడ్డది పెట్టె ఒకటి. వ్యక్తి చప్పుడు లేకుండా తీసుకుపోయింది.

* * *

వెంకప్ప మాంసలో నల్లినిఛీకుతూ పండుగ్లేక పోదాం అమ్మా, అన్నాడు.

నీ ఇష్టంరా, అంది సుబ్బాలు.

నల్లిని కుక్కకేసి, లేచి చెయ్యికడుక్కున్నాడు. ఈబండికి వెళ్తానే అన్నాడు.

ఈవేళ వెళ్ళకపోతేం? అంది. అబ్బే అంటూ చొక్కా తొడుక్కుని జోడుదొడుక్కుని వాకిట్లో పచారు చేస్తున్నాడు “కోరీభజింతును గోవిందున్ మది” అంటూ పాడుతూ సుబ్బాలు అన్నం తినలేక పోయింది.”

అన్నం తినలేదేం?

సహించటంలేదయ్యా! అంది తల్లి సుబ్బాలు. బయలుదేరేడు. కుక్క, పిల్లి కాళ్ళకడ్డంపడ్డయి. వాట్ని అదలించుకువెళ్ళేడు. తల్లి కొడుకుమాటకు వ్యతిరేకంగా

వెళ్లుటకిష్టంలేక ఒక్కమాటని ఊరుకుంది. ఊర్లోకుక్కలు- ఊరుచివర నక్కలు మొర్యో్యమని ఏడుస్తున్నయి. వెంకప్ప తుక్క మోర పైకెత్తిఏడ్చింది. సుబ్బాలు ఛా! అంది.

రైలు గుప్‌గుప్‌మనుకుంటూవచ్చేస్తుంది. రుప్పల్లో వ్యక్తి ఇటూ అటూ చూసింది. ధక్‌మంది. ఒక్కపరుగును వెళ్ళింది. వెంటనే దబ్‌మంది. హాహారులో అదోమాదిరిగా కేకకూడాను. పెట్టెని ఒదిలి ఆవ్యక్తి రెండోచోటకు పోయింది. ఆ చీకట్లో పట్టాలకు పదిగజాలదూరంలో అమ్మా, అనే మూల్గుడు వినబడ్డాది. దగ్గరకుపోయి చెయ్యివేసింది. వెచ్చగా తగిలింది. చూచింది. రక్తం ప్రవాహాలుగా కారిపోతుంది.

నా కొడుకా! అంది ఒక్కపెట్టున సుబ్బాలు. వెంకప్ప మాటలేదు. ఎందుకు ఏడుస్తుందో అని కాబోలు చంద్రుడు వచ్చేడు. ఆ వెన్నెల్లో కొడుకు శరీరంచూసి ఏడ్చింది. నెత్తి నేలకేసి కొట్టుకుంది. "నీ బాబుగతే నీకు పట్టిందా" అంది ఏడుస్తూ. గుప్‌గుప్‌మంటూ గూడ్సు ఒస్తుంది. సుబ్బాలు ఓ నిట్టూరువిడిచింది. కొడుకుశవాన్ని ముద్దెట్టుకుంది. లేచింది. కూర్చుంది. ముద్దెట్టుకుంది. గుప్‌గుప్‌మంటుంది దీపంలేని గుడ్డిగూడ్సు. బాబా! అని మరోసారి ముద్దెట్టుకుంది. కళ్ళుమూసుకుంది. లేచింది. గుడ్డిగూడ్సు అధికారం చెలాయించింది.

---


## జగదేకరంభ

జగదేకరంభయన నీపేరే జగదేకరంభ. రంభఅంటే దేహసౌందర్యముచేతనేగాక శీలసౌందర్యముచే ప్రపంచాన్ని మెప్పించిన నారీరత్నము. చమత్కారమైన కథ.

గ్లేజు ప్రతి 1-కి 0-10-0 తపాలఖర్చులు వేరు:

## మిత్రద్రోహము

తిన్నయింటికి వాసాలెంచు సామెతనుబట్టి యల్లబడిన రసవంతమగు నవల. ఇదివర కిట్టినవల వెలువడలేదు అపరాధాన్వేషకము అత్యద్భుతము. గ్లేజు ప్రతి 1-కి 0-8-0

తపాలాఖర్చు ప్రత్యేకము.

ధనలక్ష్మి కంపెని,
సౌకారుపేట, మదరాసు.

## లీలా

లేక

## సురేంద్ర నగరమణి

రసవంతమగు నవలారాజము

బాలురకు తలితండ్రులయందు భక్తియు, స్త్రీలకు పతియందలి ప్రేమయు, పురుషులకు రాజవిశ్వాసము నీగ్రంథపఠనచే యలవడును.

ప్రతి 1-కి రు 1-0-0

ఆర్యా బుక్‌డిపో,
19, తాండవరాయ మొదలివీధి, తిరువళ్ళిక్కేణి, మదరాసు.